అల్లు బాబురావుకు సీపీఐ ప్రతినిధి బృందం పరామర్శ

విశాలాంధ్ర - విశాఖ: ఇటీవల అనారోగ్యానికి గురైన సిపిఐ, ఏఐటీయూసీ నాయకుడు కామ్రేడ్ అల్లు బాబురావును సిపిఐ ప్రతినిధి బృందం శుక్రవారం తగరపువలసలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించింది. బాబురావు త్వరగా కోలుకోవాలని పార్టీ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆకాంక్షించారు. బాబురావుని పరామర్శించిన వారిలో సిపిఐ, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శులు నూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, చిల్ల నరసింహులు, రాంపైడి, మోర అప్పలరాజు తదితరులు ఉన్నారు.

నిత్యావసర ధరలు నియంత్రించాలి

సీపీఐ, ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర వస్తువులు, కూరగాయలు, వంటనూనె, పప్పుల ధరలు

విపరీతంగా పెరిగి ఆర్థిక భారాలతో జీవనం సాగించలేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తగరపువలస కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన నిర్వహించి దుకాణాల వర్తకులకు, ప్రజలకు పెరిగిన ధరలపై కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు అదుపులో ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక ఇస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక అందుబాటులో లేకుండా చేశారని విమర్శించారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు పనులు లేవని తెలిపారు. పెరిగిన ధరలతో బ్రతుకు జీవనం సాగించలేక అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు గత వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపి కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందని నమ్మి అధికారం ఇచ్చిన విషయం దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. ఇసుక అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శులు నూరి రాంబాబు, కొండపు ఈశ్వరరావు, సిల్ల నరసింహులు, సిల్ల రాంపైడి, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ తదితరులతో పాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇచ్చిన
హామీలు నిలబెట్టుకుంటాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎన్నికల ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నిలబెట్టు కుంటామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలో నిర్వహించిన విశాఖపట్నం బార్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ టీడీపీ పార్టీలో ఉన్న నాయకులంతా చట్టాన్ని గౌరవిస్తారని, ఇక్కడ రాజకీయాలు మాట్లాడటం లేదన్నారు. యువగళం పేరుతో 222 రోజుల పాటు 3,132 కి.మీల పాదయాత్ర చేశానని, ప్రతిరోజూ ఎంతోమందిని కలిసి వారి సమస్యలు తెలుసుకున్నానని, అందులో భాగంగానే న్యాయవాదులు పడుతున్న ఇబ్బందులు, కష్టాల గురించి తెలుసుకున్నానన్నారు. న్యాయవాదులకు హెల్త్ కార్డులు మంజూరు విషయంలో ఆరోగ్యశ్రీయే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకంతో అనుసంధానం చేసి మెరుగైన స్కీమ్ తీసుకురావాలనేది మా లక్ష్యం అన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు భవనాల పనులు పూర్తిచేస్తామని, ఇళ్ల నిర్మాణం, ఇంటి పట్టాలు అందిస్తామన్నారు. న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చించి దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు పెద్దఎత్తున పోరాడారని, ఆ చట్టం అమలై ఉంటే మన భూములు మన చేతుల్లో ఉండేవి కావని, గత పాలకులు ఎప్పుడూ ఈ విధంగా కూర్చొని మాట్లాడలేదన్నారు. విశాఖలో ప్రశాంతమైన వాతావరణం ఉంటుందని, రాజకీయంగా, కొన్ని కారణాల వల్ల నేను మంగళగిరిని ఎంచుకున్నానని, విశాఖను అభివృద్ధి చేసేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయన్నారు. మొదటి వంద రోజుల్లో ఒక్క ఐటీ కంపెనీ అయినా ఇక్కడకు తీసుకువస్తానని హామీ ఇచ్చానని, టీసీఎస్‌ను గర్వంగా తీసుకు వచ్చామన్నారు. 2019లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన పట్టణాల్లో విశాఖ 9వ స్థానంలో ఉంటే గత పాలనలో 10వ స్థానానికి పడిపోయిందన్నారు. ఎకనామిక్ యాక్టివిటీ ఆగిపోయిందని, దీనిని పునరుద్ధరిస్తామన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తామని, ఎయిర్ పోర్ట్, మెట్రో ప్రాజెక్టు, స్పెషల్ ఎకనమిక్ జోన్లు తీసుకువస్తామన్నారు. ఈ రోజు రాష్ట్రం మైనస్ నుంచి మొదలైందని, 2014లో జీరోలో ఉంటే 2024లో మైనస్ లో ఉన్నామని, కేంద్రం సహకారం వల్లే ప్రభుత్వం నడిపించుకో గలుగుతున్నామన్నారు. లేకపోతే పరిస్థితి దారుణంగా ఉండేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 2,500 కోట్లు బకాయిలు పెట్టారని, చిక్కీ గుడ్లకు రూ.250 కోట్లు బకాయిలు పెట్టారని, ఆరోగ్యశ్రీకి రూ.2వేల కోట్లు బకాయిలు పెట్టారని, వ్యవస్థలన్నింటినీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ ముతుకుమిల్లి శ్రీ భరత్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, జిల్లా కోర్టులో అటెండర్లకు జీతాలు సక్రమంగా అందడం లేదని చెబుతున్నారని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

లాయర్లకు నిరుద్యోగ భృతి కింద ఇచ్చే రూ.3వేలు లాయర్లకు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రి నారా లోకేష్‌ను బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.

> విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై సీఎంతో చర్చించి నిర్ణయం
> న్యాయవాదులకు ఆరోగ్యభద్రతతో పాటు ప్రత్యేక రక్షణ చట్టం
> విశాఖకు టీసీఎస్ రాక ప్రారంభం మాత్రమే
> విశాఖ బార్ అసోసియేషన్ సమావేశంలో మంత్రి నారా లోకేష్

వెంకన్న తిరు పవిత్రోత్సవాలు



విశాలాంధ్ర - భీమిలి: భీమిలి శ్రీ ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి వారి క్షేత్రంలో జరుగుతున్న తృతీయ తిరు పవిత్రోత్సవాల సందర్భంగా శ్రీ స్వామి వారికి సామూహిక వ్రతములు నిర్వహించి, పవిత్రాలను సమర్పించారు. అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి, అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, కలిగొట్ల శ్రీరామచంద్ర మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు, వి.బంగారాజు, హరినాథరెడ్డి, పాల్గొన్నారు. ముప్పిరాల అనంతాచార్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శేషాచార్యులు, మనోజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.

సీఎం సహాయ నిధికి ఏయూ 79.95 లక్షలు విరాళం

- మంత్రి నారా లోకేష్‌కు అందజేసిన ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లు

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 79,95,116 విరాళం అందించింది. శుక్రవారం రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి దీనికి సంబంధించిన చెక్కును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావులు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం ఏయూ బోధన, బోధనేతర ఉద్యోగులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా ఈ నిధులను అందించినట్లు మంత్రి నారా లోకేష్‌కి ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు తెలిపారు. వరద కారణంగా నష్టపోయిన ప్రజలకు తమవంతు సహాయాన్ని అందించడానికి ఏయూ త్వరలో మరొక రూ.40 నుంచి 50 లక్షలు ఏయూ అనుబంధ కళాశాలల తరుపున ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిస్తామన్నారు.

స్టూడెంట్ అంబాసిడర్‌గా వెంకట సాయి తేజేష్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థి దాసరి వెంకట సాయి తేజేష్ స్టూడెంట్ అంబాసిడర్ టు క్లబ్స్ అండ్ కాలేజ్(ఎస్ఏసిసి)గా నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య జి.రాంబాబు ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాల యంలో సాయి తేజేష్‌కు ఉత్తర్వులను అందజేసి అభినం దించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా నిలచే క్లబ్‌లను బలోపేతం చేయడం, సమన్వయ పరచడం, కార్యక్రమాలు నిర్వహించడం జరపాలన్నారు. ఈ సందర్భంగా తేజేష్‌ను పలువురు విద్యార్థులు అభినందించారు.

అప్పన్నను దర్శించుకున్న ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ శ్రీ వరాహాలక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధా శ్యామ్ రాథో, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాస్, సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ తల్లి శాలిని తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.త్రినాథ రావు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అర్చక స్వాములు నాద స్వరాల మధ్య వేద మంత్రాలతో స్వాగతం పలికి ముందుగా కప్ప స్తంభం ఆలింగనము చేసుకుని తమ తమ గోత్ర నామాలతో సంకల్పం చేయించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈఓ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

అవంతి పాలిటెక్నిక్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస అవంతి పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవంతి విద్యాసంస్థల చైర్మన్ అవంతి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ ఈమధ్య ఎంతో ప్రాధాన్యత పొందిందని, ప్రతీ ఒక్కరూ ఇప్పుడు పాలిటెక్నిక్ చదవాలనే కుతూహలంగా ఉన్నారని అన్నారు. భారతదేశం రానున్న కాలంలో ఐటీ రంగంలో ఇంకా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ బాగా కష్టపడితేనే ఫలితం ఉంటుందని తెలిపారు. మరో ముఖ్య అతిథి విజయనగరం జెఎన్‌టియు జీవి వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కృషి, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అందుకోగలరని అన్నారు. పాలిటెక్నిక్‌లో చదివిన వారెందరో ఇప్పుడు మంచి ఉద్యోగాలు పొందినట్లు చెప్పారు. అవంతి విద్యా సంస్థలలో బాగా కష్టపడి చదివిన వారికి మంచి ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు పొందవచ్చుని చెప్పారు. సీనియర్ విద్యార్థులతో మంచి స్నేహబంధం ఏర్పాటు చేసుకొని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని అన్నారు. విశిష్ట అతిథిగా ఎన్ఎస్‌టిఎల్ సైంటిస్ట్ ఎఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ వి.రామకృష్ణ హాజరయ్యారు.

విశాఖ కోర్టుకు మంత్రి లోకేష్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: తనపై సాక్షి పత్రిక రాసిన తప్పుడు కథనానికి సంబంధించి రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. 12వ అదనపు జిల్లా కోర్టు వాయిదాకు లోకేష్ హాజరయ్యారు. సాక్షి పత్రిక తప్పుడు కథనాలపై నారా లోకేష్ న్యాయ పోరాటం చేస్తున్నారు. 2019 అక్టోబర్ 22న 'చినబాబు చిరుతిండి రూ.25 లక్షలండి' పేరుతో సాక్షిలో అసత్య కథనాన్ని ప్రచురించారు. అవాస్తవ కథనాలు ప్రచురించిన సాక్షిపై మంత్రి లోకేష్ రూ.75 కోట్లకు పరువు నష్టం దావా వేశారు. ఉద్దేశ పూర్వకంగా తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించడంపై ఈ కేసు దాఖలు చేశారు. ఆగస్టు 29న తొలిసారి క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఈరోజు మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్‌కు మంత్రి హాజరయ్యారు. ఆయన వెంట ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు, పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ గైర్హాజరు వల్లే కోడి కత్తి కేసు ఆలస్యం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాజకీయ లబ్ధి కోసమే కోడి కత్తి కేసులో జగన్ కోర్టుకు గైర్హాజరవుతూ వాయిదాలు వేయిస్తున్నారని దళిత నేత డాక్టర్ బూసి వెంకటరావు, డిఫెన్స్ లాయర్ అబ్దుల్ సలీం ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి కోడి కత్తి కేసు శుక్రవారం ఎన్ఐఏ కోర్టులో విచారణకు వచ్చింది. నిందితుడు కోడి కత్తి శ్రీను కోర్టుకు హాజరు కాగా బాధితుడు, ప్రధాన సాక్షి మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి ఈ రోజు కూడా కోర్టుకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కేసు వచ్చేనెల 15 తేదీకి వాయిదా వేసారని తెలిపారు. సుదీర్ఘ కాలంగా వాయిదాలు మీద వాయిదాలు పడటానికి జగన్ మోహన్ రెడ్డి హాజరు కాకపోవడమే కారణమని అన్నారు. 2029 ఎన్నికల వరకూ కేసును తాత్సారం చేసి కోడి కత్తి బొమ్మతో మరోసారి సానుభూతి పొందాలనే రాజకీయ కుట్ర దాగి ఉందని వెంకటరావు ఆరోపించారు. చివరకు తనకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ కోసం కూడా హైకోర్టులో కోడి కత్తి కేసు ప్రస్తావించినట్టు గుర్తు చేశారు. విశాఖ కోర్టులో విచారణ నిలిపి వేయాలని జగన్ హైకోర్టు నుండి స్టే తెచ్చారని అందుకే గత 8 నెలలుగా విచారణ ప్రక్రియ నిలిచి పోయిందని న్యాయవాది సలీం తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి హోదాను అడ్డుపెట్టుకుని ఐదేళ్ల జగన్ కోర్టుకు రాలేదని, సాధారణ ఎమ్మెల్యేగా అతన్ని కోర్టుకు రప్పిస్తాం, సాక్ష్యం చెప్పిస్తాం అన్నారు. జగన్ కోర్టుకు రాకపోతే కోర్టును వారెంట్ కోరి వారెంటుతో కోర్టులో హాజరుపరుస్తాం అని వెల్లడించారు.

కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణపై దృష్టిసారించాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణపై దృష్టి సారించాలని, పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. నగర పరిధిలోని కమ్యూనిటీ టాయిలెట్ల తాజా పరిస్థితిని గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం సఫాయి కర్మచారీ వ్యవస్థపై సమీక్షించే నిమిత్తం వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్మికుల అవసరాలు, సమస్యలు, జీవనోపాధి తదితర అంశాలపై చర్చించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఐడీ కార్డులు ఇవ్వాలని, బీమా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్లు, ప్రయివేటు ఆసుపత్రులు, కల్యాణ మండపాల్లో పని చేసే కార్మికులకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పునరావస చర్యలు, జీవనోపాధి ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాలని, స్వయం ఉపాధి పొందేందుకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. సమాజంలో బహిరంగ మూత్ర, మల విసర్జన చేయటం సరికాదని వీటిపై ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పించి మార్పు తీసుకురావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, ఆర్డీవో పి.శ్రీలేఖ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రామారావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌తో అధిక ప్రయోజనాలు

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, ఇతర ఉత్పత్తిదారులు డిజిటల్ మార్కెటింగ్ విధానాలను అనుసరించాలని, మరిన్ని ప్రయోజనాలు పొందాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ ప్లాట్ ఫాంలో అందరూ చేరాలని చెప్పారు. ఈ కామర్స్ విధానాలకు పెద్దపీట వేస్తూ విక్రయదారులకు, కొనుగోలుదారులకు ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న యాప్‌లు ద్వారా ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. జిల్లా పరిశ్రమలు, ఉత్పత్తుల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగింది. గత సమావేశంలో చర్చించిన అంశాలు తీసుకున్న చర్యలపై ముందుగా కలెక్టర్ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. పి.ఎం. విశ్వకర్మ పథకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్ఫలితాలు సాధించాలని సూచించారు. భూ కేటాయింపులు, సేకరణకు సంబం ధించిన సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. స్టాండ్ అప్ ఇండియాలో భాగంగా స్కిల్ ట్రైనింగ్ అందించాలని సూచించారు. ఆటో నగర్ పారిశ్రామిక వాడలో ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో భాగంగా పారిశ్రామిక వేత్తలు కొన్ని అంశాలపై మాట్లాడారు. కామన్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుకు ఆటో నగర్ ప్రాంతంలో స్థలం కావాలని పారిశ్రామిక వేత్త ఒకరు అడగ్గా పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో విశాఖపట్నం ఆర్డీవో పి.శ్రీలేఖ, జిల్లా పరిశ్రమల శాఖ జి.ఎం. వి.ఆదిశేషు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, పలువురు పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో పల్లె పండుగ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక నాయకులు రామరాజు హాజరయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేశారన్నారు. పాండ్రంగి పంచాయతీకి సుమారు 15 లక్షల రూపాయలు సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి మంజూరు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు, వార్డు సభ్యులు, టిడిపి నాయకులు మహంతి అప్పల రమణ, మాజీ ఎంపీటీసీ బి.సంతోష్, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, జనసేన మండల ఉపాధ్యక్షుడు విన్నింటి సారథి, కొసర అప్పలనాయుడు, బర్నాల శ్రీనివాసరావు, వెన్ని బంగారనాయుడు, పాండ్రంగి రాజు, పల్లి శంకర్, సత్యం, చిన్నయ్య, పాపారావు, కూటమి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసిఎ స్కిల్ డెవలప్మెంట్ పోటీలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని గిడిజాల జిల్లా పరిషత్ హైస్కూల్లో శ్రీ మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7,8,9,10 తరగతుల విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మహాలక్ష్మి కల్చర్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని బోస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల 240 నుండి 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. ఈ పోటీ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యతను వెలికి తీయవచ్చని అన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

హారతి కర్పూరంలా అప్పన్న సొమ్ము...!

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి సొమ్ము హారతి కర్పూరంలా రోజు రోజుకు పంచ భూతాల్లో కలసిపోతుంది. ఆలయంలో భద్రత నిమిత్తం 2017-18 మధ్యలో కొంత మొత్తం దాతల సహకారం, దేవస్థానం అధికారులు లక్షల రూపాయిలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన 6 డోర్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ మెటల్ డిటెక్టర్లు 4 కొనుగోలు చేశారు. ప్రస్తుతం అవి కేశఖండనశాల ఎదురుగా డోర్ మెటల్ డిటెక్టర్‌లు ఓ మూలకు విసిరివేశారు. దాతలు ఏ వస్తువైనా విరాళం అంద జేసేంత వరకు వారి బాధ్యత. పిదప వాటి నిర్వహణ ఆలయ సిబ్బంది, పర్యవేక్షణా అధికారులది కాదంటారా ? 2020లో పాత తలుపులకు ఇత్తడి రేకు తాపడం చేసి ఉండేది. నీలాద్రి గుమ్మం ద్వారాలకు స్వర్ణ రేకులను చేయిస్తామని దాత ముందుకు వచ్చారు. ఆయనకు సరైన గౌరవం దక్కక ఆ పని కాస్త అటకెక్కింది. ఇత్తడి గుర్రం ఎక్కడుందో తెలియదు, వరహరూపం(ఇత్తడి) విగ్రహం, పలు బంగారు, వెండి, ఇత్తడి, వాహనాలు ఇలా అనేక విరాళాలు ఇచ్చిన దాతలు గగ్గోలు పెడుతున్నారని భక్తులు, స్థానికులు అంటున్నారు. అదేవిధంగా కొండపైన బస్ స్టాండ్ వద్ద దివిస్ సంస్థ వారిచ్చిన భక్తుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిర్వహణకు నోచుకోవటం లేదు. ఇటీవల శనివారం స్వామివారి దర్శనంకు వచ్చిన భక్తులు త్రాగు నీరు దొరకక నానా అవస్థలు పడ్డారని అక్కడున్న దుకాణ నిర్వాహకులు తెలిపారు. కొండ కింద తితిదే దేవస్థానం వారి సత్రం శిథిలావస్థకు చేరింది. అయినా కొంతమంది గుత్తేదారులను పోషించేందుకు రక రకాల మరమ్మతులు, రెనోవేషన్‌లు చేస్తూ స్వామివారి సొమ్ము హారతి కర్పూరంలా గాల్లో కలిపేస్తున్నారు. కొండక్రింద కొండ బస్ స్టాండ్‌లో ఉన్న స్టేషనరీ గది భద్రత లేదాయే, వర్షపు నీరు కారుతుండటం అక్కడున్న ఫైల్స్, స్టేషనరీ పుస్తకాలు మొదలైనవి తడిసి పోతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి అయినా చూడటం లేదు.

ఎందుకంటే క్షణం తీరిక లేదు. అలా అని చమటలు పట్టే పనులు జరగడం లేదు. ఉన్నది కాస్తా కేంద్రప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ పనులు తప్పా. అక్కడుకు కూడా దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ లేదాయె. అంతా సంబంధిత గుత్తేదారు సిబ్బంది వారికి నచ్చినట్లు వారు నిర్మాణం చేస్తున్నారు. ఇలా జరగకూడదని సిబ్బందిని, అధికారులను అందరినీ ఓ తాటిపైకి తెచ్చేందుకు ప్రస్తుత ఈఓ అప్పుడప్పుడు తన కార్యాలయంలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అందుకు కారణం అక్కడ ఉన్న కొద్దిసేపైనా అధికారులు మనస్పర్థలు లేకుండా ఒకరితో ఒకరు మాట్లాడుకుని సమన్వయంతో విధులు నిర్వహిస్తారని ఈఓ ఆశ. అంతే కానీ వారిని ఇబ్బంది పెడదామని కాదు సుమా...

జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్లో
బాల్యం విద్యార్థినులకు అవార్డులు

అభినందనలు తెలిపిన నగర మేయర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ బాల్యం విద్యా కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థినులు న్యూఢిల్లీ నుండి "చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్" సంస్థ నిర్వాహకులు నిర్వహించిన లైవ్ కాంపిటీషన్లో అత్యుత్తమమైన ప్రతిభను కనబరిచినందుకుగానూ మూడు జాతీయ స్థాయి అవార్డులను పొందడం అభినందనీయమని, మిగిలిన విద్యార్థినీ, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె తన చాంబర్లో అవార్డులు పొందిన విద్యార్థి నులను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మతో కలిసి అభినందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నడపబడుచున్న బాల్యం విద్యా కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్న ముగ్గురు బాల్యం విద్యార్థులు ఇటీవల 29 సెప్టెంబర్ 2024న జరిగిన జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారని "చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్", న్యూ ఢిల్లీ నిర్వాహకులు ధ్రువీకరించారన్నారు. మొత్తం దేశంలో 18 రాష్ట్రాలకి సంబంధించి 86 జిల్లాల నుంచి 543 మంది 3 నుంచి 5 సంవత్సరాల విద్యార్థులతో చేపట్టిన ఈ జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్లో దత్తి తనుశ్రీ, 4 సంవత్సరాలు, తారకరామ నగర్ బాల్యం కేంద్రం, "పద్యాలు, పాటల" కేటగిరీలో విజేతగా నిలవడం జరిగిందన్నారు. కొల్లాబత్తుల సోనిక, 4 సంవత్సరాలు, కప్పరాడ బాల్యం కేంద్రం, "శ్లోక పఠనం" కేటగిరీలో సూపర్ పెర్ఫార్మర్గా నిలవడం జరిగిందని, కొడమంచిలి కాశ్విక, 4 సంవత్సరాలు, శివాలయం బాల్యం కేంద్రం, "పద్య పఠనం" కేటగిరీలో సూపర్ పెర్ఫార్మర్గా నిలవడం జరిగిందన్నారు. ఈ విద్యార్థినుల ప్రతిభను అభినందిస్తూ వారికి "చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్", న్యూ ఢిల్లీ నిర్వాహకులు అందిచిన మెడల్స్, షీల్డ్స్, ప్రతిభ ధృవీకరణ పత్రాలను మేయర్ విద్యార్థినులకు అందించారు. బాల్యం విద్యా కేంద్రాలలో నమోదు అయ్యే 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటలు, పాటలతో కూడిన విద్యా బోధనను బాల్యం విద్యార్థిని విద్యార్థులకు అందించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని మేయర్ అధ్యాపకులను ఆదేశించారు. చిన్న పిల్లలు మొబైల్ ఫోన్ టీవీలకు ఆకర్షితులు కాకుండా వారిలో పూర్వ ప్రాథమిక విద్యపై సృజనాత్మకత పెరిగే విధంగా విద్యా బోధన చేపట్టాలని బాల్యం అధ్యాపకులకు తెలియపరుస్తూ, బాల్యం విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా విద్యను బోధించేటట్లు చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్కు మేయర్ సూచించారు. బాల్యం విద్యా పథకంలో ఇటువంటి వినూత్న కార్యక్రమములు చేపడుతున్న జీవీఎంసీ బాల్యం విద్యా పథకం సహాయకులు ఆవుపాటి మోహన్ కుమార్ను మేయర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఎస్.ఎస్.వర్మ, ఎడ్యుకేషన్ విభాగం సూపరింటెండెంట్ చిన్నమ్ములు, బాల్యం అధ్యాపకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ స్థాయి సంఘంలో
అభివృద్ధి పనులకు ఆమోదం

- మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో జీవీఎంసీ పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని స్థాయి సంఘం సమావేశ మందిరంలో అందరు స్థాయి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 85 అంశాలను పొందుపరిచారని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప 08 అంశాలు వాయిదా వేయగా అందులో 1,2 అంశాలు గతంలో స్థాయి సంఘం వాయిదా వేసినందున వాటిని కౌన్సిల్ సమావేశంలో తిరిగి పొందుపరుచుటకు గాను, 3వ అంశం గతంలో స్థాయి సంఘం ఆమోదం పొందియున్నందున మొత్తం 3 అంశాలను ఉపసంహరించినట్టు తెలిపారు. మిగిలిన 74 అంశాలు ఆమోదం పొందా యన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.6.04 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.2.45 కోట్లు అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో జీవీఎంసీ కార్యదర్శి బి.వి.రమణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, శాంతిరాజ్, మురళీక్రిష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణరాజు, సహాయ వైద్యాధికారి డా.సునీల్ కుమార్, బయాలజిస్టు సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తక్షణమే తగ్గించాలి

విశాలాంధ్ర - పెందుర్తి: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు పెందుర్తి పరిధిలో గల 11 కెవి సబ్ స్టేషన్ దగ్గర ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పేదలపై మోపిన భారాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా సీపీఎం పెందుర్తి జోన్ సెక్రటరీ బి.రమణి మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు ఇష్టానుసారం చార్జీలు పెంచి పేదలపై భారం మోపుతున్నారని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు, రాజు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయం దగ్గర మద్యం షాపును మూసేయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: ఎన్డీఏ ప్రభుత్వం మద్యం షాపుల వేలం ప్రక్రియను పారదర్శకంగానే నిర్వహించిందని, రాజకీయ దురుద్దేశంతో కొందరు విమర్శలు చేస్తున్నారని విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు పేర్కొన్నారు. విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీతమ్మధార ప్రాంతంలో కొత్తగా మంజూరైన మద్యం షాపులు పాఠశాలలు, దేవాలయాల సమీపంలో ఉన్నాయంటూ కొన్ని పత్రికలలో వార్తలు వచ్చాయని, అయితే ఆ పక్కనే గత ప్రభుత్వం మంజూరు చేసిన మద్యం షాపు గురించి ప్రస్తావించకపోవడం విచారకరమని విమర్శించారు. దేవాలయాలు, పాఠశాలల సమీపంలో మద్యం షాపులు ఏర్పాటును తాను కూడా వ్యతిరేకిస్తానని, అయితే టిపిటి కాలనీ, వినాయకుడి గుడిదగ్గర ఉన్న మద్యం షాపును ముందుగా మూయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ షాపు దేవాలయానికి సమీపంలోనే ఉండి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నోమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అబ్కారీ శాఖాధికారులు వెంటనే ఆ మద్యం షాపును మూయించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా పల్లె పండుగ



విశాలాంధ్ర - పెందుర్తి: సబ్బవరం మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, పెద గొల్లలపాలెం, బాటజంగాలపాలెం, ఆసకపల్లి, సబ్బవరం, బోధివలస, ఎల్లుప్పి, మగ్రిపాలెం, గుల్లేపల్లి పంచాయతీలలో శుక్రవారం పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు ఉత్సాహంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్య అతిధిగా హాజరై ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ పూర్ణిమ దేవి, ఎంపీడీవో, ఎమ్మార్వో, పంచాయతీరాజ్ డీఈ, ఏఈ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉమ్మడి ఎన్డీఏ మహా కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంభవ్ హ్యాకథాన్ 2024ని ప్రారంభించిన అమెజాన్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఈ-కామర్స్లో భారతీయ చిన్న, మధ్యస్థ వ్యాపారాల (ఎస్ఎంబిలు) కోసం నెక్స్ట్-జెన్ టెక్ మరియు ఏఐ - శక్తితో కూడిన ఆవిష్కరణలను రూపొం దించడానికి దేశవ్యాప్తంగా అమెజాన్ సంభవ్ హ్యాకథాన్ 2024ని ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ఈరోజు ప్రకటించింది. ఈ హ్యాకథాన్ భారతదేశంలో జరిగే సంస్థ యొక్క ప్రధాన వార్షిక శిఖరాగ్ర సదస్సు యొక్క ఐదవ ఎడిషన్ అయిన అమెజాన్ సమ్భవ్ 2024కి లీడ్-అప్లో భాగంగా ఉంది మరియు భారతదేశం యొక్క డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడేందుకు భారతదేశం అంతటా ఆవిష్కర్తలను ఆహ్వానిస్తుంది. దీనికోసం స్టార్టప్ ఇండియా, డిపిఐఐటి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఇండియా, ఎన్ ఐఎఫ్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ కౌన్సిల్తో అమెజాన్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

ఫోన్పే నుండి బాణసంచా ప్రమాదాల రక్షణకు కొత్త ఇన్సూరెన్స్ కవరేజ్

విశాలాంధ్ర -విశాఖపట్నం: రాబోయే దీపావళి పండగ సీజన్ను పురస్కరించుకుని, బాణసంచా సంబంధిత ప్రమాదాలనుండి సమగ్ర రక్షణ అందించి, సరసమైన ఇన్సూరెన్స్ కవరేజ్ అందించేలా కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్ను ఆవిష్కరిస్తున్నామని ఫోన్పే నేడు ప్రకటించింది. పండగ సీజన్ సందర్భంగా కేవలం రూ.9 (జీ ఎస్ టీ సహా)కే అందుబాటులోకి వచ్చిన ఈ కవరేజ్ ప్లాన్ బాణసంచా సంబంధిత ప్రమాదాల నుండి రక్షణ కల్పించేలా ఫోన్పే యూజర్లకు 10 రోజుల చెల్లుబాటుతో రూ.25,000 వరకు కాంప్రహెన్సివ్ కవరేజీని అందిస్తుంది. ఈ ఆవిష్కరణతో, దేశవ్యాప్తంగా యూజర్లు తమకు ఆస్పత్రి ఖర్చులు, ప్రమాద చికిత్స ఖర్చులకు తగిన రక్షణ ఉందనే ధీమాతో పండుగను భద్రతతో, మనశ్శాంతితో జరుపుకోవచ్చు.

మిలియన్ పిల్లల తో డెట్టాల్ బనేగా స్వాస్త్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: రెకిట్స్ ఫ్లా ఆగ్ షిప్ కాంపైన్, డెట్టాల్ బనేగా స్వాస్త్ ఇండియా (బిఎస్ఐ) అంతర్జాతీయ హ్యాండ్ వాషింగ్ దినోత్సవం 2024ను సంబరంలో భాగంగా, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం చేతులు కడుక్కోవడం యొక్క ప్రాధాన్యతపై భారతదేశం వ్యాప్తంగా 30 మిలియన్ పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. 'క్లీన్ హ్యాండ్స్ ఫర్ ఆల్: అడ్వాన్సింగ్ హెల్త్ ఈక్విటీ త్రూ హైజీన్' ఇతివృత్తంగా, ఈ కార్యక్రమం అన్ని స్థాయిలకు చెందిన పిల్లలకు ప్రధానమైన పరిశుభ్రత గురించి అవగాహన ఉండాలని, ఎవరూ ఈ విషయంలో వెనకబడకూడదని నిర్ధారించడంలో డెట్టాల్ బిఎస్ఐ యొక్క నిబద్ధతను తెలియజేస్తోంది. అంతర్జాతీయ హ్యాండ్ వాషింగ్ దినోత్సవం 2024 సందర్భంగా, బిఎస్ఐ కింద డెట్టాల్ స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం 100కి పైగా భాగస్వాముల మద్దతుతో 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలలో 30 మిలియన్ పిల్లలను నిమగ్నం చేసింది.

ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉపసర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ పి.నారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి, త్రాగునీరు, పారిశుద్ధ్యం ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు వారి పరిధిలో దృష్టిసారించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని, పాలకులతోనే పంచాయతీ అభివృద్ధి జరుగుతుందన్నారు. కలుషిత నీరు, పారిశుద్ధ్య లోపం వల్ల గ్రామాల్లో చాలామంది ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కాబట్టి ప్రతి పాలకులు దీనిపై దృష్టి పెట్టి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలని తెలియజేశారు. ఎప్పటికప్పుడు మంచి నీళ్ల ట్యాంకులను శుద్ధి చేయడం డ్రైనేజీలు నిర్వహణ అలాగే నిరుపయోగంలో ఉన్న డంపింగ్ యార్డులను వినియోగంలోకి తీసుకొని రావడం కొరకు కృషి చేయాలని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించి తద్వారా గ్రామ ఆదాయ వనరులు పెరిగేటట్లు కృషి చేయాలని తెలియజేశారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో స్థానిక ఎంపీపీ రాంబాబు, ఎంపీడీవో విజయ్ కుమార్, జడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్, ఈవోపీఆర్డీ మీనా కుమారి, ఏవో ఉమా, రిసోర్స్ పర్సన్ ప్రసాద్రావు, మండల, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ మాజీ పీవో శ్రీనివాసరావు మృతి బాధాకరం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఇప్పటి వరకు జిల్లాలో సేవలందించిన సమగ్ర శిక్షా అభియాన్ మాజీ ప్రాజెక్టు అధికారి బి.శ్రీనివాసరావు మృతి చాలా బాధాకరమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఏ పని చెప్పినా అంకితభావంతో పని చేసేవారని నిర్ణీత కాలంలో లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేసేవారని గుర్తు చేశారు. మందరిలో ఒక్కడిగా ఉన్న ఆయన ఇటీవల తూర్పుగోదావరి డిపివోగా బదిలీపై వెళ్లారని, ఇప్పుడు శాశ్వతంగా మన నుంచి దూరం అయిపోయారని విచారం వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశంలో భాగంగా శ్రీనివాసరావు మృతికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు అందించిన సేవలను జిల్లా కలెక్టర్ కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ వండుల రవీంద్ర బాబు పాల్గొన్నారు.

దేశానికే తలమానికంగా పీఎం శ్రీ పాఠశాలలు

విశాలాంధ్ర - భీమిలి: పీఎం శ్రీ పాఠశాలలు దేశానికే తలమానికంగా తయారు కాబోతున్నాయని ఆయా పాఠశాలలో విద్యార్థులు అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించేలా తయారవుతారని భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అన్నారు. డైట్ కాలేజీలో విశాఖపట్నం జిల్లా పిఎం శ్రీ అంతర్ పాఠశాలల పోటీలు ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం వారి ఆదేశాలను అనుసరించి విశాఖపట్నం జిల్లాలో 5 పీఎం శ్రీ పాఠశాలలో వివిధ రకాల కార్యక్రమాలు గురించి పాఠశాల స్థాయిలో 7 నుండి 11తేదీ వరకు పోటీలు అకడమిక్ మానిటరింగ్ అధికారిని డాక్టర్ జి.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలల స్థాయిలో వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులతో జిల్లా స్థాయి పోటీలు స్థానిక డైట్ భీమునిపట్నం నందు డా. జి.లక్ష్మి అసిస్టెంట్ ఏఎంఓ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 25 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వైభవ్ ఈవెంట్ లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సాంప్రదాయాలు మీద క్విజ్ నిర్వహించడం జరిగింది. మంతన్ మండల్ ఈవెంట్లో వికసిత్ భారత్ లేదా ఒకే దేశం ఒకే ఎలక్షన్ అనే అంశం మీద డిబేట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మూడవ ఈవెంట్లో డిజిటల్ క్వెస్ట్లో భాగంగా విద్యార్థులు వివిధ అంశాల మీద అనగా పర్యావరణం, స్పోర్ట్స్, విద్య, జెండర్, డెమోక్రసీ హ్యూమన్ రైట్స్ మీద వారి యొక్క అభిప్రాయాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించడం జరిగింది. నాలుగవ ఈవెంట్గా డిస్కవర్ అండ్ లెర్న్ లోకల్ సైట్స్ అంశానికి సంబంధించి, మీ చుట్టుప్రక్కల ప్రాంతానికి చెందిన విశేష ప్రాచుర్యం కలిగిన ఏదైనా ఒక అంశాన్ని ప్రతిభంబించేలా ఎగ్జిబిషన్ విత్ ఫొటోస్ అండ్ పేపర్ క్లిప్పింగ్స్ సేకరించి విద్యార్థులు వివరించడం జరిగింది. నాలుగు అంశాలలో విజేతరగా నిలబడిన పాఠశాలల విద్యార్థులకు గౌరవ జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదగా సర్టిఫికెట్ ఇస్తారు. డైట్ వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ ప్రారంభోత్సవం చేశారు. డైట్ ఫ్యాకల్టీ త్రినాధరావు, సోమయాజులు, హరిణి, నీలిమా న్యాయ నిర్ణతలుగా వ్యవహరించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన పాఠశాలలు అక్టోబర్ 21 నుండి 23వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పీఎం శ్రీ పాఠశాలల 25 రోజుల కార్యక్రమాల పోటీలకు హాజరవడం జరుగుతుంది అని తెలిపారు.

విద్యుత్ ఇందన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

సీపీఎం రాస్తారోకో

విశాలాంధ్ర - తగరపువలస: విద్యుత్ ఇందన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు ట్రూ ఆఫ్ చార్జీలు పేరట సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయలు భారం వేయడానికి విద్యుత్ ట్రాన్స్కో, జెన్కో సంస్థలు ప్రభుత్వం కుట్ర చేస్తున్నాయని, అలా చేస్తే ప్రజలపై మరింత భారం పడే అవకాశం ఉందని, ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. కరెంటు ట్రూ ఆఫ్ చార్జీలు పేరిట ప్రజలపై మరింత భారం వేసే ఆలోచన వెంటనే విరమించు కోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిట్టివలస సబ్ స్టేషన్ ఏఈకి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమ్లి సిపిఎం పార్టీ జోన్ కమిటీ నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు, కే.నాగరాణి, సభ్యులు వంపాను సూర్యనారాయణ, నేలాతి రాము, పల్ల పెంట రాజు, దువ్వి రామకృష్ణ, రీస్ చిన్నారావు, చిల్ల కొత్త రెడ్డి, బోని అప్పారావు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. వారికి అన్ని రకాల అవకాశాలను కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను చేరువ చేయాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ వండుల రవీంద్రబాబు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో పి.శ్రీలేఖ, డీసీపీలు, ఏసీపీలు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విజిలెన్స్ కమిటీ సభ్యులు భాగస్వామ్యమయ్యారు. సమావేశంలో భాగంగా ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ డీడీ వివరించారు. ఇన్వెస్టిగేషన్, విచారణ దశలో ఉన్న కేసుల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు.

స్టే ఉన్న కేసులపై కదలిక తేవాలి : ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు

సుమారు ఏడు కేసులపై హై కోర్టు స్టే ఉన్నట్లు సమావేశంలో భాగంగా పోలీసు అధికారులు తెలపగా వాటిలో కదలిక తీసుకొచ్చేందుకు అధికారులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు సూచించారు. న్యాయ నిపుణులతో బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్టే కేసుల విషయంలో మరింత చొరవ చూపాలని, బాధితులకు, అధికారులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐ, ఎంఎల్తో మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏఐసిటీ-వైబ్రెంట్ ఎడ్వకసి ఫర్ అడ్వాన్స్మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(వాణి) సహకారంతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏఐ, ఎంఎల్, డిఎస్పై తెలుగులో చర్చ వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతంపైగా వినియోగిస్తారన్నారు. ప్రజల్లో వీటిపట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది నూతన ఉపాధి అవకశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్లలో ఏయూ కేంద్రీయ విద్యసంస్థలైన ఐఐటిల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. సిఎస్ఈ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నూతన సాంకేతికతలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృ భాషలో అందరికీ చేరువ చేసే విధంగా కృషి జరపాలన్నారు. దీనికి నాందిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. ఐటి విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వర రావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడం వలన మెరుగైన అవగాహన కలుగు తుందన్నారు. టెక్నాలజీ అందరికీ చేరువ కావాలన్నారు. సిఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట రావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం ఎంతో అవసరమని, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రెండురోజుల చర్చ వేదిక సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తదితరులు ప్రసంగించారు. అనంతరం అమెరికా నుంచి ఏఐ సాంకేతికత భవిష్యత్ అంశంపై సునీల్ ఎస్ రంక, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, న్యూరల్ నెట్ వర్క్పై విజయ్ ప్రసంగించారు.

విశాఖ రీజియన్ గ్రోత్ హబ్

ప్రణాళిక రూపకల్పనపై మేథో చర్చ

నీతీ ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల భేటీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నీతీ ఆయోగ్ ఆధ్వర్యంలో చేపట్టబోయే గ్రోత్ హబ్ ప్రాజెక్టు రూపకల్పణ, విశాఖ రీజియన్ అభివృద్ధి ప్రణాళికపై మేథ పరమైన చర్చ జరిగింది. శుక్రవారం స్థానిక వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నీతీ ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విశాఖ రీజియన్ లోని ఎనిమిది జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. నీతీ ఆయోగ్ గుర్తించి సెక్టార్ల పరిధిలో ఇప్పటి వరకు రూపొందించిన ప్రణాళిక స్థితి గతులను, జోడించిన అంశాలను నీతీ సభ్యులు పరిశీలించారు. విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న అవకాశాలు, సహజ వనరుల లభ్యత, అనుకూల, ప్రతికూల అంశాలపై సుదీర్ఘంగా చర్చ సాగింది. గ్రోత్ హబ్ రీజియన్ లో చేపట్టబోయే ప్రాజెక్టులు, సమగ్ర ప్రణాళిక రూపకల్పన, అమలు తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పరిస్థితులను స్థానిక అధికారులు వివరించగా నీతీ ఆయోగ్ అధికారులు సావధానంగా విన్నారు. గ్రోత్ హబ్ ప్రాజెక్టులు చేపట్టబోయే జిల్లాల్లోని అభివృద్ధి ఛోదకాలైన వ్యవసాయం, పర్యాటక, తయారీ, వ్యాపార, వాణిజ్య రంగాలు, ఆర్థిక అవకాశాలు, రవాణా, పరిపాలనా ముంబై, సూరత్, వారణాసి రీజియన్లలో ప్రణాళిక రూపకల్పన

చివరి దశలో ఉన్నాయని, విశాఖపట్టణం రీజియన్ ప్రణాళిక రూపకల్పన మధ్య దశలో ఉందని నీతీ ఆయోగ్ అధికారులు అభిప్రాయపడ్డారు. ఇక్కడి ప్రణాళిక పూర్తిగా తయారైతే గనుక జనవరిలో రిపోర్టు విడుదల చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుందామని పేర్కొన్నారు. సమావేశంలో నీతీ ఆయోగ్ ఉన్నతాధికారులు, విశాఖపట్టణం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, విజయ కృష్ణన్, దినేశ్ కుమార్, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ కమిషనర్లు పి. సంపత్ కుమార్, కె.ఎస్. విశ్వనాథన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రుణాలను త్వరితగతిన

లబ్ధిదారులకు అందించండి

- బ్యాంకర్లు లబ్ధిదారులకు సహకరించాలి
- జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగర పరిధిలో గల పట్టణ పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలకు సంబంధించి రుణాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు బ్యాంకర్లు సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి రమణమూర్తి బ్యాంకర్లను కోరారు. శుక్రవారం ఆయిన జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశం మందిరంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ ఆదేశాల మేరకు బ్యాంకర్లతో సమావేశాన్ని యుసిడి - పిడి సత్యవేణితో కలిసి నిర్వహించారు. ఈ సందర్బంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పీఎంస్వనిది. పీఎం విశ్వకర్మ, ఏపీ టిట్కో హౌసింగ్ లోన్స్, వన్ సెంట్ లోన్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం తదితర పథకాల కు సంబంధించిన అంశాలపై చర్చించి, బ్యాంకర్లు బ్యాంకులో పెండింగ్ లో ఉన్న పథకాలకు సంబంధించి అన్ని లోన్ అప్లికేషన్లను వెంటనే మంజూరు చేసి లబ్దిదారులకు లబ్ధి చేకూరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ తెలిపారన్నారు. అదేవిధంగా బ్యాంకర్లు లోన్లు రికవరీ విషయంలో ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు చేకూరే లోన్ల విషయంలో ఎటువంటి ఆలస్యం చేయరాదని బ్యాంకర్లను కోరారు. అలాగే యు సి డి ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి మాట్లాడుతూ బ్యాంకు అధికారులు మరియు యు సి డి అధికారులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, తద్వారా లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చగలమని తెలియజేశారు. ప్రత్యేకముగా ఏ.పి.టిడ్కో. పి.యం. విశ్వకర్మ, పి.యం. స్వనిదికి సంబంధించిన పథకాలకు అర్హులైన లబ్ధి దారులందరకు పథకాలు వర్తించేలా, ప్రతిఫలం అందేలాగా అందరు బ్యాంకు అధికారులు సహకరించాలని హాజరైన బ్యాంకర్లను కోరారు. ఈ సమావేశంలో జీవీఎంసీ యుసిడి ప్రాజెక్ట్ అధికారులు డి.లక్ష్మి, బి.రమణమ్మ, డిపిఓ కనకమహాలక్ష్మి, ఏపీడీలు, టీపీఆర్వోలు, జీవీఎంసీ పరిధిలోని అన్ని బ్యాంకుల ప్రతినిధులు, సీనియర్ అధికారులు, యుసిడి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి: సీపీఎం

విశాలాంధ్ర- కే కోటపాడు : ఈమండలం ఏ కోడూరు గ్రామంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2018 నుండి విద్యుత్ వాడకం పన్ను వేసిందన్నారు . ముఖ్యమంత్రి చంద్రబ్బాబు నాయుడు ఆనాడు బాదుడే బాదుడు అంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారని, ఈరోజు ప్రజల బాధలు తెలియడం లేదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టల్లా ఈనాడు రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం వ్యవహరించడం ప్రజలను మోసం చేసినట్లే నని అన్నారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఉన్న మహిళలందరికీ నెలకి 1500 రూపాయలు ఇస్తానని, రైతు పెట్టుబడి సాయం కింద 20 వేల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తానని,హామీలు ఇచ్చారని అన్నారు . ఇప్పటివరకు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు . జిల్లాలో నాలుగు సుగర్ ఫ్యాక్టరీలు ఆధునికరిస్తామని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణ, ఆపుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి,ఇప్పుడు సాగతీత ధోరణిగా వ్యవహరించడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచం, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తాం, మెగా డీఎస్సీ పెడతాం, నిత్యవసర వస్తువులు ధరలు అందుబాటులో, ఉంచుతామని ఉత్తర కుమారుని ప్రగల్బాలు పలికారని ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెప్తారు అని విమర్శించారు, తక్షణమే చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వనం సూర్యనారాయణ, సూరెడ్డి రామన్న,సూరెడ్డి గంగనాయుడు పాల్గొన్నారు.

గ్రామసభలో 26 ధరఖాస్తులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కందిపూడి గ్రామంలో రీసర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రైతుల నుండి 26 దరఖాస్తులు అందాయి. రైతుల సమస్యలు సత్వర పరిష్కరిస్తామని తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఈకార్యక్రమంలో డిటి రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాధ్, విఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చిక్కాల ప్రభాకరరావు వర్థంతి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో చిక్కాల ప్రభాకరరావు 16వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఉన్న ప్రభాకరరావు విగ్రహానికి వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆసుపత్రులను సందర్శించిన డీఎంహెచ్ఓ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వి.జగదీశ్వరరావు గోపాలపట్నంలో గల లక్ష్మి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, రైల్వే న్యూ కోలనీలో గల కృష్ణ మెటర్నిటీ ఆసుపత్రి, సీతమ్మధారలో గల క్వీన్స్ ఎన్.ఆర్.ఐ ఆసుపత్రిలను సందర్శించి అక్కడ మాతృమరణాలు సంభవించడానికి గల కారణాలు తెలుసుకుని పలు సూచనలు చేసారు. ఇకముందు మాతృమరణాలు సంభవించడానికి వీలు లేదని సంబందిత ఆరోగ్య సిబ్బంది గర్భిణీగా ఉన్నప్పటినుండి నిరంతర పర్యవేక్షణ, డాక్టర్లతో చెకప్ చేయించుకోవడం, హై రిస్క్ ప్రేగ్నేన్సి గుర్తించి వారికి అవసరమైన మందులు సలహాలు ఇవ్వాలని, సాదారణ ప్రసవములు అయ్యేటట్లు ప్రోత్సహించాలని, ప్రైవేటు ఆసుపత్రుల వారు ప్రత్యేకించి అవసరమైతే తప్ప సిజేరియన్‌లు చేయరాదని పలు సూచనలు చేశారు. అర్హులైన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని, వర్షాకాలం కాబట్టి క్లోరినేషన్ చేసిన నీటినే త్రాగాలని, నీటినిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కలుగాచేసారు. కనుక మాతృ మరణాలు ఇకముందు ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రుల యందు జరగకుండా తగు జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. ఈ సందర్భనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.ఎస్.జీవనరాణి, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డా.అప్పారావు, శ్రీమతి ఐ.మనోరమ, పట్టణ ఆరోగ్య కేంద్రం, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.

పాతపట్నం ఎమ్మెల్యే తాలూకా...

రోడ్డు మీద రోడ్డు రూ.22 లక్షలు

విశాలాంధ్ర - హిరమండలం : పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తాలుక అంట వారి అనుచరులు అంట హిరమండలం మేజర్ పంచాయతీ లోని చిన్న కోరాడ వీధిలో కొత్త గా సీసీ రోడ్డు మీద సీసీ రోడ్ కు గాను ఉన్న డ్రైనేజిని తొలగించి వాటి మీద ఉన్న పై కప్పులను తొలగించి కొత్త గా డ్రైనేజీ నిర్మాణం చేయుటకు గాను ఈనెల

14 వ తేదిన చిన్న కోరాడ వీధి జంక్షన్ లో శిలాఫలకం ను తాలూకా మనుషులు అంట ఏర్పాటు చేశారు. ఈ వీధి లో 240 ఇళ్ళు ఉన్నాయి. వీధిలోని చాలా మంది ప్రజలకు తెలియజేయకుండా శుక్రవారం జెసీబీని తెచ్చి కాలువపై ఉన్న పలకలను తొలగించడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో ఆదివారం డ్రైనేజీని తవ్వుదాం కాలువ పై ఉన్న ఇంటిమెట్లు ను పడగొడధామ్ ఎవడు వస్తాడో చూద్దాం అని వెళ్లి పోయారు. కొంత మంది కాలువ పై వేసుకున్న పలకలను పగులుగొడతారట, ఎమ్మెల్యే తాలూకా వాళ్ళవి అంట పడగొట్టరట, ఇదేం అన్యాయం, ఇదెక్కడి దర్మం, స్థానికంగా ఇద్దరు వార్డు మెంబెర్స్ ఉన్నప్పటికి శిలా పలకముపై పేర్లు లేవు పని చేస్తాడట అతని పేరు రాయించు కుంటాడటా ఆలా అని ఈ 22 లక్షలతో వీధి అంత రోడ్డు పై రోడ్డు నిర్మాణం జరుగదు అట వీధి సగం వరకే వస్తాదట. వీధి ప్రజలకు అడగనక్కర లేదు. వీళ్ల అభిప్రాయాలు తీసుకోనవసరం లేదా వీధి లో సీసీ రోడ్డు ఉంది. డ్రైనేజీ ఉంది. వీధి చివర నుంచి వంశధార నది స్మశాన వాటికకు వెళ్లేందుకు సీసీ రోడ్డు ను నిర్మిస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా కొంతమంది డిచ్‌లు తొలగించి కొంతమంది కాలువ డిచ్ లు ఉంచడం చాలా బాధకరం. అలాగే చాలా చక్కగా ఉన్న సీసీ రోడ్డుపై రోడ్డు వేయడం నిధులు దుర్వినియోగం అవ్వొచ్చు అని పలువురు విమర్శలు చేస్తున్నారు. అధికారులు మాత్రం పని చేయించేది ఎమ్మెల్యే తాలూకా వాళ్ళు కాబట్టి మనం బిల్లులు అందించేద్దాం అని కూర్చున్నారు. పైగా అధికారులు అందరూ ఇటీవలే బదిలీలపై వచ్చామంటున్నారు. దీనిపై జిల్లా ఉన్న తాధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-జలుమూరు: మండలం తలుతిరియా లింగాలపాడు పంచాయతీ వాసుదేవపురంలో శుక్రవారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణ అధికారి చిన్న రాజులు ప్రజలను కోరారు. పలువురుకు

పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని మందులు అందజేసి దీర్ఘకాలక వ్యాధులు ఉన్నవారికి ప్రత్యేక వైద్యాన్ని అందజేశారు. ఆయనతో పాటు వైద్య సిబ్బంది అంగన్వాడి ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

చింతాడకు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర- ఆమదాలవలస: ప్రస్తుతం 2 ఏ డీజే ఏపీపీ గా ఉన్న చింతాడ సత్యనారాయణ కి అదనపు బాధ్యతలు 1 ఏ డీజే, ఎం డి పి ఎస్, మరియు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు, అలాగే రాజాం సబ్ కోర్టు, టెక్కలి సబ్ కోర్టు, ఇంచార్జీ గా బాధ్యతలు ఇస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. చింతాడకు

అదనపు బాధ్యతలు అందించడంతో ఆముదాలవలస బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేశారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -జలుమూరు: హైందవ సాంప్రదాయ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో గౌరీ పౌర్ణమి రోజున గౌరీ దేవి నందమ్మ ఉత్సవాలు ఏర్పాటు చేసుకోవడం అనాధ నుండి వస్తున్న ఆచారం. దీనిలో భాగంగా గురువారం రాత్రి గౌరీ పౌర్ణమి సందర్భంగా అర్ధరాత్రి వరకు అనేక గ్రామాల్లో నంది వాహనంపై శివపార్వతి విగ్రహ అలంకరణతో ఉన్న బొమ్మలను తలపై నెట్టుకొని మేల తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ భారీ ఊరేగింపులు జరిగాయి. శుక్రవారం ఉదయాన్నే గౌరీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించి

సారవకోట మండలం వడిన వలస గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన గౌరీ దేవి ఉత్సవాల్లో పలువురు మహిళలు పురాతన పాటలతో పలువురుని ఆకట్టుకున్నాయి. చల్లవానిపేట గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా ఏర్పాటు చేస్తున్న గౌరీ దేవి ఉత్సవాలు శుక్రవారం పూజలందుకున్నాయి.

చెరువుగర్భంలో రోడ్డు నిర్మాణం ఫిర్యాదుపై విచారణ

విశాలాంధ్ర- పొందూరు: మండలం గోకర్ణపల్లి గ్రామంలో సచివాలయానికి చెరువుగర్భంలో రోడ్డు నిర్మాణం చేసారని గోకర్ణపల్లి గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు గ్రీవెన్సు లో ఇచ్చిన పిర్యాదుమేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ వెంకటేశ్ రామానుజు లు ఆధ్వర్యంలో రెవెన్యూ

అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. చెరువుగర్భాన్ని పూడ్చి నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్తులు పిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసిన అధికారులు రోడ్డు చెరువుగర్భంలోనే ఉన్నట్లు గుర్తించారు. దీనిపై జిల్లా కలెక్టర్కు నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు.